క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్, జేసీబీ

శ్రీకాళహస్తి: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఆ వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న కోగిల సుబ్రహ్మణ్యం

తొట్టంబేడు: మండలంలోని కాసరం గ్రామానికి చెందిన తొన్నాటి చంద్రయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండలాధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఆటోలు, సైకిళ్లకు మరమ్మతులు చేయండి



మరమ్మతులకు నోచుకుని ఈ-ఆటో

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించేందుకు ప్రతి పంచాయతీకి కేంద్రప్రభుత్వం స్వచ్ఛ భారత్ పథకంలో ఈ ఆటోలు, మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. వీటితో పాటు ప్రతి ఇంటిలోని తడి, పొడి చెత్తనే సేకరించడానికి గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. గ్రీన్ అంబాసిడర్లను ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఈఆటోలు, సైకిళ్ల ద్వారా చెత్త కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఆటోలు, సైకిళ్ల మరమ్మతులు గురయ్యారు. వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ఈ ఆటోలు, సైకిళ్ల మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తను తరలించడానికి గ్రీన్ అంబాసిడర్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ ఆటోలకు, సైకిళ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రీన్ అంబాసిడర్ల కోరుతున్నారు.

జింక పిల్ల అప్పగింత



జింక పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న హెడ్ కానిస్టేబుల్ హనీఫ్

నాగలాపురం: మండలంలోని నందనం హైవేపై సోమవారం రాత్రి ఓ జింక పిల్ల రోడ్డుపైకి రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్వల్ప గాయాలతో రోడ్డు పక్కన పడి ఉన్న జింక పిల్లను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ హనీఫ్ అక్కడికి చేరుకుని జింక పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

బడి కోసం ధర్నా

నారాయణవనం: మా పిల్లలు మా ఊరిలోనే చదువుకుంటారని, మరో బడికి పంపలేమని మండలంలోని బొప్పరాజుపాళెం పంచాయతీ లక్ష్మీపురం ఎస్టీ కాలనీ వాసులు, తల్లిదండ్రులు మంగళవారం ధర్నా చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ పాలసీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు పిల్లలను చదువుకు దూరం చేస్తోందన్నారు. పాఠశాలల విలీనం విధానంతో ఎస్సీ, ఎస్టీల పిల్లలే నష్టపోతున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

రేణిగుంట: ఇంటి నుంచి పాఠశాలకు వెళుతున్న విద్యార్థిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. రేణిగుంట మండలం గాజులమండ్యం వద్ద రేణిగుంట-చెన్నై ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం ఎల్లమండ్యం గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు పదో తరగతి విద్యార్థి యశ్వంత్ గాజులమండ్యంలోని పాఠశాలకు వెళుతున్న క్రమంలో విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న లారీ ఢీ కొంది. విద్యార్థి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కరకంబాడి వద్ద మూడు రోడ్లు కలిసే సర్కిల్



ఇరానీ కేఫ్ లోకి దూసుకెళ్లిన ఇసుక టిప్పర్(ఫైల్)



మలుపులో యమపురి తలుపు

కడప- రేణిగుంట రహదారిపై కట్టపుట్టాలమ్మ గుడి కూడలి..కరకంబాడి గ్రామంలోకి ప్రవేశించే ఈ ప్రాంతం ప్రమాదాలకు కేంద్రం. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు సర్వ సాధారణం. ఈ కూడలికి చేరుకునే ముందు అధిక వాలు ఉండడం..యూటర్న్ తీసుకునే చోటు కావడంతో నిత్యం ఈ ప్రాంతం రక్తసిక్తమవుతోంది. మలుపులో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రాణాలు హరీ అనక తప్పదు.

రేణిగుంట: కడప- రేణిగుంట ప్రధాన రహదారిలోని కరకంబాడి వద్ద ఉన్న కట్టపుట్టాలమ్మ ఆలయం చెంత ఉన్న మలుపులో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కరకంబాడి రైల్వే గేటు వద్ద కొండపై నుంచి కిందకు వచ్చే క్రమంలో వాలు ఎక్కువగా ఉండంతో కడప నుంచి వచ్చే వాహనాలు అతి వేగంగా రావడం, తిరుపతికి వెళ్లేందుకు యూటర్న్ తీసుకునే క్రమంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. నెలరోజుల వ్యవధిలోనే మూడు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడడమే ఇందుకు నిదర్శనం. కడప నుంచి వచ్చే వాహనాలు పైనుంచి కిందకి వచ్చేటప్పుడు వేగంగా రావడంతో వాహనాలను కంట్రోల్ చేయలేక రహదారి పక్కకు మళ్లిస్తున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు.

ఉదాహరణలివీ..

- గత వారంలో ఇరానీ కేఫ్‌లోకి ఇసుక టిప్పర్ దూసుకువెళ్లింది.
- మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ముగ్గురు అతివేగంగా వచ్చి ఇరానీ కేఫ్ పక్కనున్న నేమ్ బోర్డును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదాలకు ఫ్లెక్సీలు ఒక కారణం

కూటమి నాయకులు మూడు రోడ్లు కలిసి చోట మధ్యలో అటు వైపు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వాహనాలు కనపడని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకులు ఫ్లెక్సీలు పెట్టడంతో అధికారులు వాటిని తొలగించే ధైర్యం చేయలేకపోతున్నారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం అక్కడ ప్రమాదాలకు అది కూడా ఒక కారుణమని స్థానికులు అంటున్నారు. ఉండే ఫ్లెక్సీలను తొలగించి, వేగ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో డివైడర్ పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయపడిన వ్యక్తి

రైల్వేగేటు మరమ్మ పనులు

కరకంబాడిలోని రైల్వేగేటు మరమ్మతు పనులు జరగకుండా ఉండడంతో ఆ దారిని తాత్కాలికంగా మూసివేశారు. దీంతో అన్ని వాహనాలు ఒకేసారి మూడు రోడ్ల వద్దకు వస్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రైల్వేగేట్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి అయితే సగం ట్రాఫిక్ కంట్రోల్ అవుతుంది. భారీ వాహనాలు అన్ని రైల్వేగేట్ దారిలో వెళ్లే అవకాశం ఉన్నందున ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గుతాయి.

నివారణ చర్యలు శూన్యం

నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ప్రమాదాలు నివారించేందుకు చర్యలు శూన్యంగా ఉన్నాయి. ఒకేసారి మూడు వైపులా వాహనాలు రావడం, ఏ వాహనం ఎటు వెళుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

మూడు రోడ్లు కలిసే ప్రదేశంలో హైవే పెట్రోలింగ్ సిబ్బందిని నియమించాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసాం. వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు నివారించవచ్చు. రైల్వేగేట్ మరమ్మతుతో అన్ని వాహనాలు అక్కడికి వస్తున్నాయి. మరమ్మతు పనులు పూర్తయితే భారీ వాహనాలు అటువైపు వెళతాయి.

-జయచంద్ర, అర్బన్ సీఐ రేణిగుంట

సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: ఖరీఫ్ పంట సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని నీర్పాకోట, గాజులపెళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధికారుల సూచనల మేరకు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనానికి ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని, అలాగే భూసార పరీక్షలు ఆధారంగా భూసారాన్ని బట్టి పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిపంట సాగు చేస్తున్న రైతులకు పలు సలహాలు, సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, ఏఈఓ రేవతి, రైతులు పాల్గొన్నారు.



వరి సస్యరక్షణకు సలహాలు ఇస్తున్న ఏఓ షణ్ముగం

వేడుకగా పరాశరేశ్వరుడి రథోత్సవం



నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాయంత్రం రథోత్సవంలో ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను, పరివార దేవతలకు అభిషేకాలను, 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి, భక్తులకు వితరణ చేశారు. ఆలయంలో చెక్క రథం లేకపోవడంతో సర్వభూపాల వాహనాన్ని సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు రథాన్ని తలపించే సర్వభూపాల వాహనాన్ని అధిరోహించారు. పరాశరేశ్వరస్వామి గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. ఉత్సవాల్లో బుధవారం సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి జరిగే ఆర్జిత కల్యాణోత్సవం అనంతరం అశ్వవాహనంపై గ్రావ వీధుల్లో విహరిస్తారు. ఆర్జిత కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే అర్హులకు అన్యాయం

నారాయణవనం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హత ఉన్న వారికి తల్లికి వందనం నగదు జమ కాలేదని పలువురు నిలదీశారు. మంగళవారం మండలంలో సర్పంచ్‌ల అధ్యక్షతన పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. తల్లికి వందనం అర్హులకు అందకపోవడంపై టీడీపీ నాయకులే అధికారులను నిలదీశారు. మండల కేంద్రమైన నారాయణవనంలో జరిగిన గ్రామసభలో తల్లికి వందనం నగదు పలువురికి అందలేదని సభ్యులు లేవనెత్తారు. రెవెన్యూ శాఖ పూర్తి నిర్లక్ష్యం కారణంతో సెంటు భూమి లేని పేదలకు పదులు, వందల ఎకరాల భూమి ఉందని, మరికొందరికి నెలకు రూ.12 వేల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందని చూపడంతో తల్లికి వందనం లబ్ధి పొందలేకపోయారని టీడీపీ నాయకులు ఆరోపించారు. భూ, ఆదాయ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. అందరి సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి, అందుకు సహకరించాలని అధికారులు కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ డాక్టర్ వేణయ్య, కార్యదర్శి షణ్ముగం, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న టీడీపీ నేత

యువత ముందుండాలి







మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న వినోద్ యాదవ్, శిబిచక్రవర్తి, దుద్దు వేణు (కుడి నుండి ఎడమకు)

వరదయ్యపాళెం: అధికార కూటమి ఆగడాలను నిలువరించడంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ముందుండాలని, అందుకు యువత నడుం బిగించాలని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పార్టీ యువజన విభాగం నాయకులతో నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు మొలకల వినోద్ యాదవ్‌తో పాటు రాష్ట్ర యూత్ కార్యవర్గ సభ్యుడు శిబిచక్రవర్తి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుద్దు వేణు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఈ సందర్భంగా కలిసి జ్ఞాపికను అందజేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన వెలుగు చూసింది. మండల కేంద్రంలోని స్థానిక భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద తమిళనాడులోని రెడ్‌హిల్స్‌కి చెందిన విజయ్ కుమార్ (62) ద్విచక్ర వాహనంలో మంగళవారం సాయంత్రం సొంత పనుల నిమిత్తం కేవీబీ పురం వచ్చాడు. అనంతరం ఆయన తిరిగి చెన్నై వెళ్తుండగా నాగలాపురం భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు 108కు సమాచారం అందించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విజయ్‌కుమార్ పరిస్థితి విషమం కావడంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు

నాగలాపురం: మండలకేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరైసుధ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శంకరయ్య అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో డ్రైనేజీలు, కల్వర్టులు, గ్రావెల్, ద్వారకానగర్‌లో తారురోడ్డు నిర్మాణం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, చెరువులు కుంటల పూడికతీత పనులు, పాడి రైతులకు అవసరమైన పశువులు షెడ్లు, ప్రజలు తాగునీరు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్, వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన పనులను గుర్తించి గ్రామ సభల్లో తీర్మానం చేస్తారన్నారు. తీర్మానం చేసిన పనులను జిల్లా కలెక్టరుకు పంపి పాలనాపరమైన అనుమతులు తీసుకుని, నిధులు కేటాయించి, పనులను చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత, వార్డు మెంబరు ఉదయ్ కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలి

శ్రీకాళహస్తి: అఖిల భారత కార్మిక సమ్మె ఈ నెల 9వ తేదీన జరగనుందని, సమ్మెతో మోదీ మెడలు వంచేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల నాయకులు మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమ్మెను జయప్రదం చేయడంలో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. దేశంలో మోదీ పాలన వచ్చిన తరువాత కార్మిక వర్గాల అణచివేతకు గురయ్యాయని, కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య విమర్శించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావడం మోడీ కుట్రలో భాగమన్నారు. ఏపీలో 10 గంటల పని విధానాన్ని అమలు పరచడం మోడీ, బాబు, పవన్ కార్పొరేట్ మైత్రీకి నిదర్శనమన్నారు. ఏఐటీయూసీ నాయకులు కత్తి రవి, మల్లి, ఐఎఫ్‌టీయూ నాయకులు జాకీర్, సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, వెంకటేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణం



ద్రౌపదీదేవి కల్యాణం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి కల్యాణం కనులపండువలా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారిని విశేషంగా అలంకరించి, కల్యాణవేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.



మాంగల్యం చూపుతున్న వేదపండితుడు

ఉపాధిహామీ పనుల తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద వేసవి కాలం కావడంతో కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ, సౌకర్యాలతో పాటు ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ సిబ్బందిని ఆదేశించారు. ఆమె మంగళవారం వీఎస్‌పురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలీ వస్తుందని, రోజుకు 5 వేల మంది పని చేయాలని, కూలీల సంఖ్య టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటలు పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే



సారె తీసుకెళుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ఏర్పేడు: మండలంలోని కొత్త వీరాపురంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ పెద్దలు ఆయనకు మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, కొత్త వీరాపురం మాజీ సర్పంచ్ ప్రభు, చిన్నా, నరేష్, వర్మ, మురగయ్య, ఏడుకొండలు, గోపి, సుబ్రమణ్యం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నం రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

నారాయణవనం: దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పెన్షన్లను పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని కల్యాణపురం పంచాయతీలో కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ఆయన నగదును అందజేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. కొత్తగా మండలంలో 63 మందికి పెన్షన్లు మంజూరైందని ఎంపీడీఓ అరుణ తెలిపారు.

స్విమ్స్‌లో శ్రీకాళహస్తివాసి మృతి

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన శ్రీనివాస్(43) అనారోగ్య కారణాలతో గత నెల 26న తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో తానే చేరాడు. అయితే పరిస్థితి విషమించడంతో అతడిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఇతని మృతదేహాన్ని వైద్యులు మార్చూరీకి తరలించారు. ఆస్పత్రిలో చేరిన సమయంలో ఇతని వెంట ఎవరూ లేరు. ఇతని వివరాలు తెలిసిన వారు టూటౌన్ ఎస్‌హెచ్‌ఓ 9440796772 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్కూటర్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు



చికిత్స కోసం తరలిస్తున్న క్షతగాత్రుడు

రేణిగుంట: కడప-రేణిగుంట రహదారిలోని కరకంబాడి కట్టపుట్టాలమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఇరానీ కేఫ్ నేమ్ బోర్డును స్కూటర్ ఢీ కొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మంగళవారం సాయంత్రం స్కూటర్‌పై ముగ్గురు వస్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న నేమ్ బోర్డును ఢీకొన్నారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. గాయాలైన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

వారాహి అమ్మవారికి పాలాభిషేకం



వారాహి అమ్మవారికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వారాహి ఆషాఢ నవరాత్రుల్లో భాగంగా ఆరోరోజైన మంగళవారం వారాహి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారిని వివిధ రకాల పూలతో, సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ పూజాకార్యక్రమాలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీనివాస మిల్క్ డెయిరీ సంస్థ యాజమాన్యం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి లత ఏర్పాట్లను పర్యవేక్షించారు.